సాక్షి
అనకాపల్లి

గురువారం । 9 । నవంబర్ । 2023



చిరస్మరణీయుడు తులసీరావు

క్షీర విప్లవ సారథి ఆడారి తులసీరావు తొలి వర్ధంతి ఘనంగా జరిగింది. పలువురు, నేతలు, ప్రజలు నివాళులర్పించారు. II లో



జగనన్నకు చెబుదాం

మునగపాకలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్, జేసీ 178 దరఖాస్తులు స్వీకరించారు. II లో



అప్పన్న సన్నిధిలో..

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని కోల్‌కతా హైకోర్టు జడ్జి బిభాస్ రంజన్ సతీసమేతంగా దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నలుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

సాక్షి, అనకాపల్లి: పరవాడ సంతలో ఆర్మీ ఉద్యోగితో ఘర్షణ సందర్భంగా అనుచితంగా ప్రవర్తించిన నలుగురు పరవాడ పోలీసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఏఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ బుధవారం వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆర్మీ ఉద్యోగి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుకు చింతిస్తున్నామని తెలియజేస్తూ.. అందుకు బాధ్యులైన పోలీస్ సిబ్బందిపై కఠిన చర్య తీసుకున్నట్టు ఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించిన ముగ్గురిపై చర్యలు

- కలెక్టర్ ఆదేశం

మునగపాక: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి హెచ్చరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మునగపాకకు చెందిన ముగ్గురు అధికారులపై పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో వారిపై చర్యలు తీసుకునేందుకు అవసరమయ్యే నివేదిక అందించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్‌ను ఆదేశించారు. వీఆర్వో శేషగిరిరావు సస్పెన్షన్‌కు సిఫార్సు చేయడంతో పాటు విలేజ్ సర్వేయర్లు భవాని, హేమలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ప్రమాద బాధితులకు 'బూడి' పరామర్శ



కేజీహెచ్‌లో బాధితులను పరామర్శించి వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

మాడుగుల: సామాజిక సాధికార సభకు వచ్చి తిరుగు ప్రయాణంలో జరిగిన వాహన ప్రమాదంలో గాయపడిన ముగ్గురు గిరి బాధితులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బుధవారం విశాఖ కేజీహెచ్‌లో పరామర్శించారు. ఆస్పత్రిలోని శరీర పునర్నిర్మాణ విభాగంలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులు కె.దేముడమ్మ, కె.రాజులమ్మ, బి.లక్ష్మిలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. వీరందరికీ మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ సూపరింటెండెంట్ రాధాకృష్ణలతోపాటు ప్లాస్టిక్ సర్జరీ వైద్యాధికారులకు సూచన చేశారు. వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు.

టికెట్ తనిఖీల ఆదాయం రూ.2.50 కోట్లు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌కు అక్టోబరులో టికెట్ల తనిఖీల రూపంలో రికార్డు స్థాయి ఆదాయం వచ్చిందని సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో 49,966 కేసులు నమోదు చేసి, రూ.2.50కోట్లు అపరాధ రుసుంగా వసూలు చేసినట్లు వెల్లడించారు. టికెట్ లేకుండా, అనధికారికంగా, సరైన టికెట్ లేకుండా రిజర్వుడ్ బోగీల్లో ప్రయాణించే వారిపై ఈ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వాల్తేర్ డివిజన్‌కు అక్టోబర్‌లో 2.15 కోట్లు లక్ష్యం ఇవ్వగా.. 14 శాతం అధికంగా 2.5 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. ఇది గతేడాది కంటే 9.6 శాతం ఎక్కువ అని వివరించారు. ఈ సందర్భంగా కమర్షియల్ సిబ్బందిని అభినందిస్తూ.. సరైన టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణించవద్దని ప్రయాణికులకు సూచించారు.

డిసెంబర్ 11న ఆర్.కె.బీచ్‌లో దీపోత్సవం

ఎంవీపీకాలనీ: ఆర్.కె.బీచ్ వేదికగా డిసెంబర్ 11న కార్తీక మహా దీపోత్సవం జరగనుంది. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్‌ల నుంచి అనుమతులు లభించినట్లు విశాఖ కార్తీక దీపోత్సవం కమిటీ వెల్లడించింది. టీటీడీ రాష్ట్ర వ్యాప్తంగా తిరుపతి, కర్నూల్, విశాఖలో ఈ ఏడాది కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా డిసెంబర్ 11న విశాఖలోని ఆర్.కె.బీచ్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. విశాఖ కార్తీక దీపోత్సవం కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి ఎస్జీఎఫ్ బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్ : పాఠశాలల క్రీడా సమాఖ్య అంతర జిల్లాల అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలు గురువారం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాల బాల బాలికల జట్లు పోటీపడనున్నాయి. బాలుర,బాలికల విభాగాల్లో సింగిల్స్‌తో పాటు డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ పోటీలను ప్రారంభించనుండగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హాజరుకానున్నారు.

సామాన్యుడి గుండె చప్పుడు ప్రతిధ్వనించేలా...

అట్టడుగు వర్గాలకు అగ్ర పీఠం అందిస్తూ.. సామాన్యులను అసామాన్యులను చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సామాజిక సాధికారతకు పెద్దపీట వేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారికి అన్నింటా ప్రాధాన్యమిస్తూ.. వారిని పైకి తీసుకువచ్చే ప్రయత్నాన్ని నిజాయితీగా చేస్తోంది. అందుకే ఆయా వర్గాల నుంచి సామాజిక సాధికార బస్సు యాత్రలకు విశేష ఆదరణ లభిస్తోంది. వేలాదిమంది బడుగులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. గురువారం అనకాపల్లి నియోజకవర్గంలో జరగనున్న బస్సు యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- నేడు అనకాపల్లి నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర
- మారేడుపూడి జంక్షన్ నుంచి బయ్యవరం వరకు ర్యాలీ
- ప్రగతిని ప్రతిబింబించేలా పలు ప్రారంభోత్సవాలు
- అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ



అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో సామాజిక సాధికార సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, సభా వేదిక నుంచి సూచనలిస్తున్న మంత్రి

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఉత్తరాంధ్రలో అప్రతిహతంగా సాగుతోంది. గురువారం అనకాపల్లి నియోజకవర్గంలో జరగనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి నేటి వరకు నాలుగున్నరేళ్ల పాలనలో జరిగిన సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. దేశంలో మరెక్కడా లేని విధంగా బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేలు చేసింది. గత ప్రభుత్వాలు సామాజిక న్యాయం, రాజ్యాధికారం వంటి మాటలు చెప్పాయే తప్ప ఆచరణలో పెట్టలేదు. ప్రస్తుత సర్కారు ఆ ప్రయత్నాన్ని అసిధారా వ్రతంలా చేయడంతో ఆయా వర్గాలు వివిధ రంగాల్లో ఉన్నతిని సాధిస్తున్నాయి. ఆ వాస్తవాలను వివరించడానికి ఈనెల 2న మాడుగుల నియోజకవర్గంలో చేపట్టిన యాత్రకు వేలాదిమంది ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అదే తరహాలో గురువారం అనకాపల్లి నియోజకవర్గంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రలో జయభేరి మోగించేందుకు పార్టీ శ్రేణులు, యువత ఉవ్విళ్లూరుతున్నారు. ఈ యాత్రకు అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, మేరుగు నాగార్జునలతో పాటు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి హాజరు కానున్నారు. ఎమ్మెల్సీ, బస్సు యాత్ర ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి అమర్‌నాథ్ బుధవారం రాత్రి పరిశీలించారు. సభకు తరలివచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.

విజయవంతం చేయాలి:మంత్రి అమర్‌నాథ్

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్నది వైఎస్ జగన్ ప్రభుత్వమేనని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఇస్తున్న ప్రాధాన్యతను గత ముఖ్యమంత్రి ఇవ్వలేకపోయారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో తొలి విడత సామాజిక సాధికార బస్సు యాత్ర ముగింపు సభ అనకాపల్లి నియోజకవర్గంలో జరగబోతోందని, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

సామాజిక న్యాయం:బొడ్డేడ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సామాజిక న్యాయం అందరికీ ఆదర్శప్రాయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. రాజకీయాలు, కుల మతాలకతీతంగా అన్ని వర్గాల వారికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలందించారన్నారు. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యత కల్పించారన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమాభివృద్ధిని, చేసిన మంచిని బస్సు యాత్రలో ప్రజలకు వివరించనున్నామన్నారు.

యాత్ర సాగేదిలా..

- ఉదయం 10 గంటలకు మారేడుపూడిలో సామాజిక సాధికార యాత్ర ప్రారంభం కానుంది. అక్కడ నుంచి బైక్, కార్ల ర్యాలీతో జాతీయ రహదారి మీదుగా కశింకోట మండలం బయ్యవరం వరకు యాత్ర సాగుతుంది.
- కశింకోట మండలం తేగాడ గ్రామంలో ఆర్బీకే, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభిస్తారు.
- తేగాడ గ్రామంలో పెద్ద ఎత్తున నిర్మించిన జగనన్న ఇళ్ల కాలనీని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శిస్తారు. మోడల్ స్కూల్‌ను సందర్శించిన అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరిస్తారు.
- భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి టౌన్‌లో గల ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో మంత్రులు ప్రసంగిస్తారు.

ప్రగతి వాకిట సాధికారంగా...



తేగాడలో మంత్రులు సందర్శించనున్న వైఎస్సార్ జగనన్న మెగా ఇళ్ల కాలనీ



మంత్రులు ప్రారంభించనున్న రైతు భరోసా కేంద్ర భవనం



ప్రారంభానికి సిద్ధం చేస్తున్న వెల్‌నెస్ సెంటర్ భవనం

- సామాజిక సాధికార యాత్రలో భాగంగా తేగాడ పంచాయతీకి మంత్రులు, ఎమ్మెల్యేలు
- వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

కశింకోట: తేగాడ గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం లక్షలాది రూపాయలతో నిర్మించిన పలు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు. ఆరుగురు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు కార్యక్రమానికి హాజరు కానున్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ జగనన్న ఇళ్ల మెగా కాలనీని సందర్శించనున్నారు. తేగాడ, పేరంటాలపాలెం, జోగారావుపేట, కొత్తపల్లి, బుచ్చియ్యపేట గ్రామాలకు చెందిన 178 లబ్ధిదారులకు తేగాడలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో దాదాపు సగం మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ కాలనీని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు సందర్శిస్తారు. అలాగే ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో రూ.65 లక్షలతో నాడు-నేడు కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులు చేశారు. ఈ పనులను ప్రారంభిస్తారు.

రూ.20 లక్షలతో పంచాయతీ కార్యాలయం పై భాగంలో సచివాలయ భవనాన్ని, అదే ప్రాంగణంలో రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 20.80 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని నిర్మించారు. వాటిని అందంగా ముస్తాబు చేసి శిలాఫలకాలు ఏర్పాటు చేసి ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు. సచివాలయ ప్రాంగణంలో జెండా దిమ్మెను నిర్మిస్తున్నారు. మొదట అనకాపల్లి మండల శివారు నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్రతోపాటు మోటారు సైకిల్ ర్యాలీ కశింకోట చేరుకొని మండలంలోని బయ్యవరం మీదుగా తేగాడ గ్రామం వరకు జరగనుంది. మధ్యాహ్నం ఇక్కడి పథకాలను ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ తెలిపారు. అనంతరం అక్కడి నుంచి అనకాపల్లిలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రగా బహిరంగసభకు బయలుదేరి వెళతారన్నారు. ఈ సందర్భంగా కశింకోట నుంచి తేగాడ వరకు మంత్రులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే..



'ఏపీకి జగనే ఎందుకు కావాలి' బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్, దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేరని, అందుకే ఆయనే మళ్లీ మళ్లీ సీఎంగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక రింగ్ రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో ఆయన 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' పేరిట ముద్రించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పరిశ్రమల వృద్ధి రేటులో దేశంలో 22వ స్థానంలో ఉన్న ఏపీని 3వస్థానంలో నిలిపిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ మొదటి స్థానంలో ఉండడం మనకు గర్వకారణమన్నారు. అందుకే 'మా నమ్మకం నువ్వే జగన్' అని ప్రజలు కొనియాడుతున్నారని చెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో దేశంలో 22వ స్థానంలో ఉన్న ఏపీని 2021-22లో మెరుగైన స్థానానికి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ప్రగతికి చిరునామా

గత ప్రభుత్వం ఐదేళ్లలో ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాలు 34,108 కాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో 4,93,000 ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారని బొడ్డేడ ప్రసాద్ అన్నారు. అందులో రెగ్యులర్ ఉద్యోగాల సంఖ్య 2,13,662 అని చెప్పారు. 8.2 శాతం వృద్ధి రేటుతో వ్యవసాయ రంగంలో దేశంలో 27వ స్థానం నుంచి రాష్ట్రం 6వ స్థానానికి ఎగబాకిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 37,956 కొత్త ఎంఎస్‌ఎంలుండగా గత నాలుగేళ్లలో ఆ సంఖ్య 6 రెట్లు పెరిగి, 2.5 లక్షలకు చేరుకుందన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక కొత్తగా 4 ఓడరేవులు, 10 కొత్త ఫిషింగ్‌హార్బర్లు, 2 విమానాశ్రయాలు, 17 మెడికల్ కాలేజీలు, 3 ఐటీ ఎస్ఈజెడ్‌లను నిర్మిస్తున్నారన్నారు. రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్యాన్ని అందించిన ఏకైక సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని అభివర్ణించారు.

పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

10న దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా

మధురవాడ: జిల్లా ఉపాధి కార్యాలయం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ ఫర్ జాబ్స్ సంస్థ సహకారంతో ఈ నెల 10న దివ్యాంగులకు ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జి. మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు 10 గంటలకు లంకలపల్లి బుల్లయ్య కాలేజీలో జరిగే మేళాలో అమెజాన్ కంపెనీలో ట్రాన్స్‌పోర్టేషన్ క్వాలిటీ స్పెషలిస్ట్ (సాఫ్ట్‌వేర్) ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి.. ఎంఎస్ ఆఫీస్ సర్టిఫికెట్, ఇంగ్లిష్ నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in/లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు బాలల సైన్స్ కాంగ్రెస్


కశింకోట: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2023 జిల్లా స్థాయి పోటీలు కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ డి.కాళిదాసు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఆదేశాల మేరకు రాష్ట్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నర్సింగబిల్లి పీఏసీఎస్‌లో చోరీకి విఫలయత్నం


- వాచ్‌మన్‌ను కట్టి పడేసిన దుండగులు
- లాకర్ రూంకు కన్నం.. తెరుచుకోని బీరువా
- చేసేది లేక దొంగలు పరార్



దొంగలు కట్టి పడేసిన వాచ్‌మన్ నక్కా కృష్ణ



లాకరు గదికి పెట్టిన కన్నం



సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలిస్తున్న పోలీసులు

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో చోరీకి దొంగలు మంగళవారం అర్ధరాత్రి తర్వాత విఫలయత్నం చేశారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పీఏసీఎస్‌లో ఈ తరహా చోరీ యత్నం జరగడం సంచలనం కలిగించింది. పోలీసులు, పీఏసీఎస్ సిబ్బంది అందించిన వివరాలివి. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో నరసింగబిల్లి పీఏసీఎస్ వద్దకు ముగ్గురు ఆగంతకులు వచ్చారు. అక్కడ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణను పట్టుకొని నోటిలో విషపూరితంగా భావిస్తున్న ద్రవం పోసి గుడ్డలు కుక్కి విద్యుత్ తీగలతో కాళ్లు, చేతులు కట్టి సంఘ ప్రాంగణంలో పడేశారు. అనంతరం సంఘ భవనం ప్రవేశ ద్వారం గెడలు, తాళాలు పగలగొట్టారు. తలుపులు తెరచి లోపలికి ప్రవేశించారు.

సీసీ కెమెరాలకు నల్లటి ఫోం వెదజల్లారు. స్ట్రాంగ్ రూమ్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. స్ట్రాంగ్ రూం గది గోడకు డ్రిల్లింగ్ మెషిన్ సహాయంతో కన్నం చేసి అందులో ప్రవేశించారు. అందులోని బీరువా లాకర్‌ను తెరవడానికి విశ్వ ప్రయత్నం చేశారు. అది తెరచుకోలేదు. అప్పటికే తెల్లవారుజామున 3.30 గంటలు కావస్తోంది. ఇక ప్రయోజనం లేకపోవడం, బహుశా స్థానికుల అలికిడి కావడంతో పరారయ్యారు. స్ట్రాంగ్ రూంలో సుమారు రూ.3.50 కోట్ల విలువైన కుదువ పెట్టి ప్రజలు అప్పులు తీసుకున్న బంగారు నగలు ఉన్నాయని సంఘ సీఈవో అచ్చియ్యనాయుడు పోలీసులకు తెలిపారు. వాచ్‌మన్ కృష్ణ మూలుగుతూ కేకలు వేయడంతో పక్కనున్న వ్యక్తి వచ్చి పరిశీలించి సంఘ ఉద్యోగులకు సమాచారం అందించారు. వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడి ఉన్న కృష్ణ కట్లు విప్పి అతనిని 108 వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్రైం అదనపు ఎస్పీ పి. సత్యనారాయణరావు, క్రైం ఎస్ఐ రమేష్, అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, సీఐ రవికుమార్, ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి సంఘటన స్థలానికి వచ్చారు డాగ్ స్క్వాడ్, వేలి ముద్రల నిపుణులు వచ్చి పరిశీలించారు. సీసీ ఫుటేజీలను సమగ్రంగా పరిశీలించారు. సంఘటన తీరు బట్టి ఇది ప్రొఫెషనల్ దొంగల పనిగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



రాంనగర్ రైల్వే గేటు సమీపంలో పట్టాలపై యువకుడి మృతదేహం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): పట్టణంలో రాంనగర్ రైల్వే గేటు సమీపంలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు బుధవారం మృతి చెందాడు. ఇక్కడి రైల్వే ట్రాక్‌పై 721/8 కిలోమీటర్ వద్ద గుర్తు తెలియని రైలు నుంచి యువకుడు జారి పడి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 21 నుంచి 25 ఏళ్లు ఉంటుందని, సిమెంటు రంగు చొక్కా, నలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృత దేహాన్ని తుని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిస్తే 9494 887786, 9490 629020 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

చిరస్మరణీయుడు తులసీరావు

- యలమంచిలిలో ఘనంగా తులసీరావు సంస్మరణ సభ
- హాజరైన ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి తదితరులు



తులసీరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ సత్యవతి



ఆడారి తులసీరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

యలమంచిలి: క్షీర విప్లవ సారథి దివంగత ఆడారి తులసీరావు రైతాంగానికి, ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. బుధవారం యలమంచిలి పట్టణంలో విశాఖ డెయిరీ వ్యవస్థాపకుడు దివంగత తులసీరావు తొలి వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ ఘనంగా జరిగింది. తులసీరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశాఖ డెయిరీతో ఆయన సేవల్ని కొనియాడారు. పాడి రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన తులసీరావు ఎందరికో ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అభిమానులు, ప్రజాప్రతినిధులు విశాఖ డెయిరీ ఉద్యోగులు, పాల సంఘం సభ్యులు, రైతులు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తులసీరావు కుమారుడు విశాఖ డెయిరీ చైర్మన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. తులసీరావు సంస్మరణ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో యలమంచిలి ప్రధాన రహదారులు కిక్కిరిసిపోయాయి. యలమంచిలి సీఐ షేక్ గఫూర్, ఎస్‌ఐ పాపినాయుడు, రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, విశాఖ డెయిరీ డైరెక్టర్లు, యలమంచిలి మాజీ జెడ్పీటీసీలు ఆడారి శ్రీధర్(చిన్నా) వెంకట్, సుందరపు బాబ్జీ, బొద్దపు యర్రయ్య దొర, కౌన్సిలర్ కర్రి శివ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



తులసీరావు కుమార్తె రమాకుమారితో మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు

టీడీపీ సీనియర్ నేత వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన పెద్దాడ రాముతో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని ఎ. కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని అచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పెద్దాడ రాము ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు తారువ క్యాంప్ కార్యాలయంలో పెద్దాడ రాముకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వైఎస్సార్‌సీపీ కండువాను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో సీఎం జగన్, నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఆకర్షితుడినై వైఎస్సార్‌సీపీలో చేరినట్టు రాము తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ సరువునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు సూరి నాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్‌లో మోసె ప్రతిభ

రావికమతం: మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు 85 కిలోల సీనియర్ విభాగంలో కొత్తకోట గ్రామానికి చెందిన గసాడ మోసె రాష్ట్ర స్థాయిలో 5వ స్థానంలో నిలిచి పలువురి ప్రశంసలు పొందాడు. విశాఖలో మూడు రోజులుగా మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు జరుగుతున్నాయి. విశాఖ ఫిట్‌నెస్ బాడీ బిల్డర్ అసోసియేషన్, నవ్యాంధ్రప్రదేశ్ ఫిట్‌నెస్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు హాజరయ్యారు. అనకాపల్లి జిల్లా నుంచి మోసె పోటీల్లో పాల్గొన్నారు. మొదటి ప్రయత్నంలోనే ప్రతిభ కనబరిచి 5వ స్థానంలో నిలిచిన ఆయన్ని అభినందించారు.



సీనియర్ విభాగంలో 5వ స్థానంలో నిలిచిన మోసె

గ్రామాల అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం



వెదురుపర్తిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



రెల్లి కాలనీలో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోటలోని రెల్లి కాలనీలో నిర్మించిన సామాజిక భవనం, వడ్డివీధిలో రూ.15 లక్షలతో నిర్మించిన డ్రైనేజీలు, వెదురుపర్తిలో రూ.21 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఒక వైపు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే, అభివృద్ధికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. రైతు భరోసా, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, నేతన్న నేస్తం తదితర అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చి ప్రజల హృదయాలను చూరగొంటున్నారని పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి సంపూర్ణ మద్దతు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్, వెదురుపర్తి సర్పంచ్ శనివాడ అరుణ, పార్టీ మండల కార్యదర్శి అల్లవరపు నాగు, పార్టీ నాయకుడు ఆళ్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'

- వినతులు, ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

మునగపాక: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. స్థానిక రాహుల్‌గాంధీ కల్యాణమండపంలో బుధవారం నిర్వహించిన స్థాయి జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. జిల్లా స్థాయి అధికారులు తమ ప్రాంతానికి వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండటంతో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలుపై విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా ఇళ్ల పట్టాలు మంజూరు, జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులకు అందించాల్సిన మెరుగైన సేవలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సిబ్బంది పనితీరుతో పాటు, ప్రజలకు అందుతున్న సేవలను గుర్తించాలన్నారు. మండల స్థాయిలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తారని, వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 178 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఆర్డీవో చిన్నికృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, డ్వామా పీడీ సందీప్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీపీవో శిరీషారాణి, తహసీల్దార్ వినయ్‌కుమార్, ఎంపీడీవో మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ కళాశాల మంజూరుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

వినతులు, ఫిర్యాదుల్లో కొన్ని..

- మండలంలో విద్యార్థులు టెన్త్ పూర్తయ్యాక ఇంటర్ కోసం వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, వీరి కోసం స్థానికంగా జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పార్టీ శ్రేణులతో కలిసి వినతిపత్రం అందించారు.
- అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వెళ్లే రోడ్డు గోతులమయంగా ఉందని, దానికి మరమ్మతులు చేపట్టాలని నాగులాపల్లికి చెందిన కర్రి భాస్కరరావు, మునగపాకకు చెందిన మణికంఠ తదితరులు విన్నవించారు.
- కొత్తగా ఏర్పడిన మల్లవరం పంచాయతీలో ఇంతవరకు పక్కా భవనం లేక ఇబ్బందులు పడుతున్నామంటూ సర్పంచ్ ఇందల హేమలత నాయుడు అర్జీ ఇచ్చారు.
- వ్యవసాయ కమతాల్లోకి వెళ్లేందుకు సరైన రహదారి సదుపాయం లేకపోవడంతో ఏళ్ల తరబడి రైతులు ఇబ్బంది పడుతున్నారంటూ పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు వినతిపత్రం అందించారు.
- మునగపాక జెడ్పీ హైస్కూల్లో నాడు-నేడు ద్వారా నిర్మిస్తున్న భవనం అర్ధాంతరంగా నిలిచిపోయినందున, దీని నిర్మాణ పూర్తికి తగు చర్యలు తీసుకోవాలని పీఎంసీ చైర్మన్ సంతోష్‌కుమార్ విన్నవించారు.
- భూ రీ సర్వేలో అందించిన పట్టాదారు పుస్తకాల్లో విస్తీర్ణాలు తేడాగా ఉన్నాయంటూ మునగపాకకు చెందిన పెంటకోట శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.
- గత కొంతకాలంగా వర్షాల్లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, దీంతో మునగపాక మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం నేతలు ఆళ్ల మహేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు వినతిపత్రం అందించారు.

సీఎం చిత్రపటానికి జర్నలిస్టుల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రెస్ క్లబ్ నేతలు

అనకాపల్లిటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడిటేషన్ జర్నలిస్టులకు 3 సెంట్ల ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు కేబినెట్‌లో తీర్మానం చేయడం శుభపరిణామమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో జర్నలిస్టులపై ఇంతటి ఆదరణ చూపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నిత్యం ప్రజల సమస్యల కోసం పోరాడే జర్నలిస్టులకు ప్రభుత్వం ఇంటి స్థలాల మంజూరుకు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం పట్ల ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మిందిలోని ఆయన స్వగృహంలో ప్రెస్‌క్లబ్ నేతలతో కలిసి బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దాల రాంబాబు, నాయకులు కె.చంద్రశేఖర్, సీహెచ్ అవతారం, డి.రామచంద్రరావు, వైవీ రమణాజీ, మద్దాల కృష్ణ, కొండలరావు, మళ్ల భాస్కరరావు, సీహెచ్ సర్వారావు, వైవీ రమణాజీ, బి.కిరణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

312 కిలోల గంజాయి స్వాధీనం



చీడికాడ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో ఉన్న కారు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మాడుగుల రూరల్ : చీడికాడ మండలం, కోనాం శివారు గుంటి కొత్తూరు వద్ద ఏజెన్సీ నుంచి చీడికాడ వైపు వెళ్తున్న కారులో తరలిస్తున్న 312 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చీడికాడ ఎస్‌ఐ పి. రామారావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 6న కోనాం సమీపంలో తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఏజెన్సీ ప్రాంతం నుంచి చీడికాడ వైపుగా వచ్చిన కారు ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులు వెంబడించారు. దీంతో నిందితులు కారును గుంటికొత్తూరు బ్రిడ్జి వద్ద వదిలి పారిపోయారు. కారును స్వాధీనం చేసుకుని నిందితుల కోసం గాలించగా ఇద్దరు పట్టుబడ్డారు. మోటారు సైకిల్‌తో పాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. నిందితులు అల్లూరి ముంచింగ్‌పుట్ మండలం జోలపుట్టు పంచాయతీ శివారు కుయిలన్‌గి గ్రామానికి చెందిన సీసా సింహాచలం (24), ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బుద్వి జిల్లా, దినాపూర్ తాలూకా సుజాతనగర్‌కు చెందిన రాజేశ్(40)ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

రావికమతం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్టు కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు కొత్తకోట బస్‌స్టాప్‌లో తమిళనాడు రాష్ట్రం దుబ్రిగూడకు చెందిన వినోత్ దాస్, కిరణ్ రాజ్‌లు బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద సుమారు రూ.లక్ష విలువైన 21 కేజీల గంజాయి లభ్యమవడంతో వారిని అరెస్ట్ చేసి చోడవరం కోర్టుకు తరలించామన్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రంగాను హత్య చేయించిన చంద్రబాబుకు మద్దతా?

- పవన్‌కల్యాణ్‌పై బొడ్డేడ ప్రసాద్ విమర్శలు
- జగన్ దయ వల్లే చంద్రబాబుకు బెయిల్
- కాపులు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచన



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

నక్కపల్లి : బడుగు బలహీన వర్గాలు, యావత్ కాపు జాతి తమ అభిమాన నాయకుడిగా భావించే వంగవీటి మోహన్‌రంగాను హత్యచేయించిన చంద్రబాబుకు పవన్ కల్యాణ్ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ తనకు రాజకీయంగా అడ్డు వస్తున్నాడని, ప్రజల్లో బలవంతుడవుతున్నాడన్న నెపంతో చంద్రబాబు నాయుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు పేదల సమస్యల కోసం శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న వంగవీటి రంగాను పథకం ప్రకారం హత్య చేయించాడన్నారు. అలాగే కాపుల రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్న ముద్రగడ పద్మనాభాన్ని ఆయన కుటుంబ సభ్యులను విచక్షణా రహితంగా పోలీసులతో ఈడ్చుకుంటూ వెళ్లి జైల్లో పెట్టించారన్నారు. ముద్రగడను పరామర్శించేందుకు వస్తున్న చిరంజీవి తదితరులను అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు నాయుడు అన్నారు. కాపులకు చేసిన ద్రోహాన్ని, ముద్రగడకు చేసిన అన్యాయాన్ని మర్చిపోయి కాపుల కోసం పాటుపడతానని చెప్పుకొనే పవన్ కల్యాణ్ చంద్రబాబునాయుడికి మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. కాపులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. కళ్లు కనిపించడం లేదు, వళ్లంతా జబ్బులు వచ్చేసాయని ప్రాధేయ పడితే జగనన్న దయవల్ల చంద్రబాబుకు బెయిల్ వచ్చిందన్నారు. ప్రభుత్వ దయ వల్ల బెయిల్ వస్తే న్యాయం గెలిచిందంటూ టీడీపీ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈనెల 28న చంద్రబాబు తిరిగి జైలు కెళ్లాల్సిందేనన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- పలు దొంగతనాల్లో రూ.6 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



మాట్లాడుతున్న ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా



పోలీసులు రికవరీ చేసిన చోరీ సొత్తు

నర్సీపట్నం: నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో జరిగిన పలు చోరీలను పోలీసులు ఛేదించారు. ఈ మేరకు ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా బుధవారం వివరాలు వెల్లడించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ అయ్యన్న కాలనీకి చెందిన చిటికెల నాగేశ్వరరావు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఓ బ్యాంక్‌లో పీవోగా పనిచేశాడు. ఆ సమయంలో తనకు ఉన్న పరిజ్ఞానం ఉపయోగించి ఏటీఎం నుంచి నగదు కాజేయడంతో ఉద్యోగం నుండి తొలగించి, కేసు నమోదు చేశారు. అనంతరం ఆయన దొంగతనాల బాటపట్టాడు. పలు చోరీలకు పాల్పడి నగదు, నగలు, విలువైన వస్తువులు దొంగిలించేవాడు. ఈ చోరీలను ఛేదించేందుకు ఏర్పాటైన ఎస్‌ఐ సుధాకర్, సిబ్బంది సత్యనారాయణ, శ్రీను, ప్రసాద్‌ల బృందానికి ఎట్టకేలకు చిక్కాడు. నిందితుడి నుంచి రూ.లక్షలు విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు రికవరీ చేసినట్లు ఏఎస్పీ వెల్లడించారు.

నిందితుడి నేర చరిత్ర

- నర్సీపట్నం మున్సిపాలిటీ అయ్యన్న కాలనీకి చెందిన గోటాల హరీష్ ఇంటిలో ఈ ఏడాది సెప్టెంబర్ 14న చోరీ చేశాడు. ఈ చోరీలో దోచుకున్న 34 తులాలు వెండి వస్తువుల్ని పోలీసులు రికవరీ చేశారు.
- ఈ ఏడాది అక్టోబర్ 5న నర్సీపట్నంలో రూ.లక్ష చోరీకి పాల్పడ్డాడు.
- నక్కపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఏడాది ఆగస్టు 4న చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతూ నాలుగు తులాల చైన్ పట్టుకుపోయాడు.
- పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో స్కూటీ దొంగలించాడు.
- నర్సీపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఈ ఏడాది మార్చిలో దొంగతనానికి ప్రయత్నించి విఫలమయ్యాడు.

ఈ కేసులన్నింట్లో నాగేశ్వరరావు నిందితునిగా ఉన్నాడు. చోరీకి పాల్పడిన వెండి, బంగారం ఆభరణాలతో పాటు రూ.60,200 రికవరీ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ ఎస్.గణేష్, ఎస్‌ఐ సుధాకర్‌ను ఏఎస్పీ అభినందించారు. డివిజన్‌లో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి టౌన్‌లో దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటి ద్వారా ఎలాంటి నేరం జరిగిన వెంటనే పట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

క్లుప్తంగా

వైభవంగా శ్రీగంగపరదేశమ్మ ఉత్సవం



శ్రీగంగ పరదేశమ్మను దర్శించుకున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెంలో పొలిమేర వంశస్తుల కులదేవత శ్రీ గంగపరదేశమ్మ ఉత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా వెలుగులతో గ్రామస్తులు వేడుక చేశారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన్ని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక, ప్రసాదాలను అందించారు.

సోహం కాశీఅన్నపూర్ణ వార్షికోత్సవం రేపు

అనకాపల్లిటౌన్: మండలంలో బట్లపూడి పంచాయతీ నాయుడుపేట సోహం ఆశ్రమంలో ఈ నెల 10న కాశీఅన్నపూర్ణమ్మ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకుడు రవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేరోజు ఉదయం 8 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. 11న ఉదయం అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు, 12న దీపావళి సందర్భంగా గొలగాం శివాలయం నుంచి రాయుడుపేట సత్తెమ్మతల్లి ఆలయం వరకు సారె ఊరేగింపు జరపనున్నట్లు పేర్కొన్నారు. 14న కార్తీమాసోత్సవాల సందర్భంగా మృత్యుంజయ హోమం నిర్వహిస్తామన్నారు. ఈ హోమాలు నాలుగు సోమవారాలూ జరుగుతాయన్నారు.

నెహ్రూచౌక్ వద్ద బీజేపీ నేతల నిరసన



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

అనకాపల్లిటౌన్: స్థానిక నెహ్రూచౌక్ కూడలిలో బుధవారం బీజేపీ స్థానిక నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ రాష్ట్ర సభ్యుడు ఈర్లె శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 2,240 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,850	4,410
రెండో రకం	3,500	4,100
మూడోరకం	3,220	3,860

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
మ్యాడ్	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
---	: వెంకటేశ్వర
ఘోస్ట్	: శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-2 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 377 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సాధికార యాత్రతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్



డీఎస్పీ సుబ్బరాజు, సీఐలతో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సిద్ధమైన సభాప్రాంగణం

- బహిరంగ సభకు ఎన్టీఆర్ మైదానంలో భారీ ఏర్పాట్లు

అనకాపల్లిటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర ఉత్తరాంధ్రలో తొలివిడత కార్యక్రమం గురువారంతో ముగియనుంది. ఇందుకు అనకాపల్లి పట్టణం వేదికకానుంది. దీంతో పట్టణంలో జరిగే బహిరంగ సభ, బస్సుయాత్రకు పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశాయి. ప్రతి గ్రామంలో బస్సుయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యాయి.

బస్సు యాత్ర వెన్నంటే..

- ఉదయం 10 గంటలకు అనకాపల్లి మండలం మారేడుపూడి జాతీయ రహదారి మీదుగా యాత్ర ప్రారంభమై కశింకోట మండలం బయ్యవరం గ్రామానికి చేరుతుంది.
- బస్సుయాత్రకు అనకాపల్లి మండలం మారేడుపూడి జాతీయరహదారి వద్ద మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ నాయకులు, శ్రేణులు ఘనస్వాగతం పలకనున్నారు.
- చిత్ర విచిత్ర వేషధారణలు, నృత్యప్రదర్శనలతో పాటు సుమారు వెయ్యి బైక్‌లతో ర్యాలీగా అతిథులతో కలిసి కశింకోట మండలం బయ్యవరం పంచాయతీ తేగాడ గ్రామానికి బస్సుయాత్ర సాగనుంది.
- కశింకోటలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మంత్రులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పిస్తారు.
- అక్కడి నుంచి బయ్యవరం మీదుగా తేగాడ గ్రామంలో పలు అభివృద్ధి పనులను మంత్రుల బృందం ప్రారంభిస్తుంది.
- తిరిగి అదే గ్రామం హైవే నుంచి కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ మీదుగా అనకాపల్లి పట్టణానికి చేరుకుంటుంది.
- పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగసభ జరగనుంది.

ఏర్పాట్ల పర్యవేక్షణ

సభ పరిశీలకులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పర్యవేక్షణలో బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. బస్సుయాత్రలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, మేరుగు నాగార్జున, ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు యూవీ రమణమూర్తి, పెట్ల ఉమాశంకర్ గణేష్, గొల్ల బాబూరావులు పాల్గొంటారు. సభాస్థలిలో 30వేల మంది జనాభా కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు డీఎస్పీ సుబ్బరాజు పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

సామాజిక సాధికార యాత్రతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తుతోంది. యాత్రకు గ్రామాల్లో భారీస్థాయిలో స్వాగతం పలికేందుకు కార్యకర్తలు సిద్ధమయ్యారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను అందజేస్తోందన్న విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలిసేలా సన్నద్ధమయ్యారు. ఏయే వర్గాలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో.. ఆయా వర్గాలకు చెందిన మంత్రులు, ముఖ్య నేతలో బస్సు యాత్ర ద్వారా వివరించనున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం చేసిన కృషిని ప్రజల ముంగిటకు తీసుకెళ్లనున్నారు. దీంతో పార్టీ క్షేత్రస్థాయి నేతలు గ్రామాల్లో తమ పట్టు మరింత పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్న ఆనందంలో ఉన్నారు.

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలి



మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీ సత్యవతి

తుమ్మపాల: ఆధునిక ప్రపంచంలో పెరుగుతున్న కాలుష్యంతో మానవాళికి ప్రమాదం పొంచి ఉందని, ప్రతి ఇంటిలో కనీసం ఓ మొక్క నాటాలని ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఎన్టీపీసీ, ఫారెస్ట్ రేంజ్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకానికి కృషి చేస్తున్న ఎన్టీపీసీ, అటవీ శాఖ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ సీఎస్సార్ హెచ్‌ఆర్ ప్రకాష్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గైపూరి రాజు, వైస్సార్సీపీ రాష్ట్ర ఆరోగ్య వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనారాయణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



పట్టణంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘాలు

తుమ్మపాల: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, కడప ఉక్కు కర్మాగార నిర్మాణం జరపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహిళా కన్వీనర్ పావని, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివాజీ తెలిపారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌వో సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంద్‌కు అన్ని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా సహకరించాయన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధ్ర ప్రజల పోరాట ఫలితంగా వచ్చిందన్నారు. 32 మంది ప్రాణత్యాగం, నాటి వామపక్ష ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు తమ పదవులకు రాజీనామా చేయడంతో కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను మంజూరు చేసిందన్నారు. రూ.5 వేల కోట్లతో నిర్మించిన ఈ ప్లాంట్‌కి, 20 వేల ఎకరాల భూముల్ని 12 గ్రామాల ప్రజలు తక్కువ ధరకే ఇచ్చారని, ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ రూ.3.5 లక్షల కోట్ల విలువ కలిగి ఉందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని కేంద్రం ప్రైవేటీకరణ చేయాలని చూడటం దారుణమన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని శంకుస్థాపన చేసి నేటికీ పనులు ప్రారంభించలేదని ఆక్షేపించారు. కడపలో స్టీల్ ప్లాంట్ వస్తే వేలాదిమందికి ఉపాధి కలుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులు, ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ , ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణికుమార్, పీడీఎఫ్‌వో రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి జి.తరుణ్, డీవైఎఫ్ఐ సహాయ కార్యదర్శి శివ, వివిధ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

చదువులో రాణించాలంటే ఆరోగ్యవంతంగా ఉండాలి

మునగపాక హైస్కూల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మునగపాక హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

మునగపాక : విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్ననాడే చదువుపై దృష్టి సారించగలరని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పేర్కొన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతంతో పాటు జగనన్న గోరు ముద్ద పథకం ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులు బలంగా ఉండేందుకు తీసుకుంటున్న పోషకాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ విద్యార్థులు రక్తం చేసే మందులు మాత్రలు వేసుకోవాలన్నారు. చదువుపై దృష్టి సారించాలంటే ముందు ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారి ప్రవళికను ఆదేశించారు. అలాగే పీహెచ్‌సీ స్థాయిలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమన్నారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ ఆయన వెంట పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ షెడ్ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మళ్ల బుల్లిబాబు

కశింకోట: స్థానిక సత్యనగర్ కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.లక్షతో రేకుల షెడ్డు నిర్మించేందుకు బుధవారం భూమి పూజ నిర్వహించారు. కంచిపాటి నూకరాజు ఆర్థిక సాయంతో చేపట్టనున్న రేకుల షెడ్డు నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం



కశింకోట గవరపేటలో గౌరమ్మ విగ్రహం ఊరేగింపు

కశింకోట: కశింకోటలోని గవరపేటలో శారదా గణపతి రామాలయంలో బుధవారం రాత్రి ఆదిగౌరీ పరమేశ్వరుల(గౌరమ్మ) విగ్రహాన్ని నెలకొల్పారు. రానున్న కార్తీక మాసం పురస్కరించుకుని నెల రోజులపాటు సంప్రదాయంగా పూజలు నిర్వహించనున్నారు. గౌరమ్మ విగ్రహాన్ని మహిళల కోలాటాలు, డప్పు వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ సంతబయల నుంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక రామాలయంలో నిలిపారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి ముగిసే వరకు మహిళలు రోజూ వేకువజామునే మేల్కొని స్థానిక శారదా నదిలో స్నానాలు ఆచరించి గౌరమ్మను పూజిస్తారు. నెల రోజుల పూజల అనంతరం గౌరమ్మను భారీగా ఊరేగించి నదిలో నిమజ్జనం చేస్తారు. దాదాపు ఐదు దశాబ్దాల క్రితం ఇక్కడే తొలిసారిగా గౌరమ్మను నెలకొల్పడం వల్ల ఆది గౌరమ్మగా పిలుస్తుంటారు. ఆ తర్వాత డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ వద్ద, పొట్టి శ్రీరాములు పార్కు వద్ద గౌరమ్మ విగ్రహాలను నెలకొల్పి ఏటా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గౌరమ్మ నిలుపు మహోత్సవంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులే శ్రేయస్కరం



పల్లపు ఆనందపురంలోని పాఠశాలను సందర్శించిన జిల్లా గణాంకాధికారి రామారావు

మునగపాక : మండలంలోని పల్లపు ఆనందపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం జిల్లా గణాంకాధికారి రామారావు సందర్శించారు. ముందుగా విద్యార్థుల హాజరు పుస్తకం పరిశీలించారు. అలాగే పిల్లల పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు.

పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరు ముద్ద పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ప్రయివేటు స్కూళ్లలో చేరి ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దన్నారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై దృష్టి సారించాలన్నారు. హెచ్‌ఎం కృపావతి, సర్పంచ్ కర్రి పెదబ్బాయి, సీఆర్పీ లక్ష్మీనారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీలో డైట్ విద్యార్థి ప్రతిభ

తుమ్మపాల: ఈ నెల 2, 3 తేదీల్లో కాకినాడ జేఎన్టీయూలో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీల కబడ్డీ పోటీల్లో స్థానిక డైట్ కళాశాల విద్యార్థి కె.తేజ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. దీంతో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే సౌత్ జోన్ విశ్వవిద్యాలయాల పోటీలకు తేజ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో బుధవారం తేజను ప్రశంసా పత్రంతో అభినందించారు. ఆ పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి, పతకం సాధించాలని అభిలషించారు. తేజ ప్రతిభ పట్ల కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, పీడీ సీహెచ్ శ్రీనివాసరావు, అడమిక్స్ డీన్ డాక్టర్ కె.పార్వతి, అకడమిక్స్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఓర్వలేకే జనసేన తప్పుడు ప్రచారం



విలేకర్లతో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

అనకాపల్లిటౌన్: సామాజిక సాధికార బస్సుయాత్రకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే జనసేన నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మంత్రి అమర్‌నాథ్‌ను విమర్శించే స్థాయి పంచకర్ల రమేష్‌బాబుకు లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తున్న అమర్‌నాథ్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు. తమ పార్టీపై ఆరోపించేందుకు అవకాశం లేక పోవడం వల్లే అడ్డగోలు విమర్శలకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో సుంకరమెట్ట సత్యనారాయణస్వామి ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడే సకల సమస్యలకు కారణం

- మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సాయిలక్ష్మి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సాయిలక్ష్మి

సబ్బవరం: మానసిక ఒత్తిడే మనం ఎదుర్కొనే సకల సమస్యలకు మూలకారణం అవుతుందని ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ సాయిలక్ష్మి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 'మేము ఉన్నాం-ఏ సమస్యకైనా పరిష్కారం ఉంది' అనే అంశంపై విద్యార్థులకు జిల్లా మెంటల్ హెల్త్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా డాక్టర్ సాయిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ఎదుర్కొంటున్న సమస్యలకు గల కారణాలను, పరిష్కార మార్గాలను వివరించారు. 20 ఏళ్ల లోపు యువతీ యువకులు ఇటీవల కాలంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని చెప్పారు. సమస్యకు కారణం ఏంటో తెలుసుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రుల సహకారంతో సమస్యల నుంచి బయటపడవచ్చన్నారు. మనుషుల మధ్య ఉండే సత్సంబంధాలు మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, మధులత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లెక్కల గణేష్, నివేదిత తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో 21 సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను ప్రారంభించిన అతిథులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం పట్టణ పరిధిలో 21 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఏసియన్ పెయింట్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సీసీ కెమెరాలను ఏసియన్ పెయింట్స్ ప్రతినిధులు బి.జగన్నాథ్, టి.వి.సృజిత్‌లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో పట్టణ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను కొంత మేర నియంత్రించవచ్చన్నారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని పోలీసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ మురళీరావు, ఎస్ఐ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ప్రారంభం

అనకాపల్లిటౌన్: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ భక్తులకు ప్రతిరోజూ మధ్యాహ్నం భిక్ష అందించనున్నట్లు తెలిపారు. ఏటా మాదిరిగానే దాతల సాయంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యకు బాసటగా ట్యాబ్‌లు

కశింకోట: మండలంలో దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యా బోధనకు అనుగుణంగా నాలుగు ట్యాబ్‌లను ప్రభుత్వం అందించినట్లు తాళ్లపాలెం హైస్కూలు ప్రత్యేక ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు తెలిపారు. తనతోపాటు తాళ్లపాలెం స్కూల్లో ఒక దివ్యాంగురాలికి, కశింకోటలోని భవిత స్కూల్లో ఇద్దరు ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందించినట్లు పేర్కొన్నారు. చోడవరంలో ప్రభుత్వ చీఫ్ విప్ కరణం ధర్మశ్రీ చేతుల మీదుగా వీటిని అందుకున్నామన్నారు.

ముగిసిన టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ

అనకాపల్లిటౌన్: పట్టణంలో గాంధీనగరం శ్రీ సత్యసాయిబాబా మందిరంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ మూడో బ్యాచ్‌కు బుధవారం శిక్షణ ముగిసింది. మందిర జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణరాజు శిక్షణలో ప్రతిభ చూపిన 8 మందికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో వైద్యులు జి.శేషుకుమార్, ట్రస్టు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి అన్నం రాజశేఖర్, మందిర సభ్యుడు ఎస్.ఎన్.లక్ష్మణరావు, అన్నం ఆంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా నిర్వహించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు లక్ష్మిరెడ్డి

పరవాడ: అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సరుకులు ఎవరికైనా బదిలీ చేస్తే విధిగా స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు లక్ష్మిరెడ్డి నిర్వాహకులకు సూచించారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ముందుగా పరవాడ 1 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి స్టాక్ రిజిస్టర్, స్టాకును తనిఖీ చేశారు. చిన్నారులకు అందించే మెనూలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని నిర్వాహ కులను సూచించారు. ఆయన వెంట అనకాపల్లి జిల్లా విద్యా శాఖ అడిషినల్ డైరెక్టర్ రవిబాబు, మండల విద్యాశాఖ అధికారి జి. సాయిశైలజ, దివాకర్‌రావు, విద్యాశాఖ సిబ్బంది ఉన్నారు. రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు లక్ష్మిరెడ్డి బుధవారం తానాం గురుకుల జూనియర్ కళాశాల, బాలికల పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



వాడ్రాపల్లిలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం బాల్య వివాహాల కారణంగా జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూకరాజు మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయన్నారు. మై చాయిస్ ఫౌండేషన్, ఆర్‌డీఎస్ఎస్ఎస్ సంయుక్త నిర్వహణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు,ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

మునగపాక : మండలంలోని మూలపేటలో బుధవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి ఆలయంలో నిలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, మాజీ ఉప సర్పంచ్ కాశీరావు, పెద్దలు శరగడం నాగేశ్వరరావు, బొడ్డేడ ఆదికుమార్, భీశెట్టి నాగేశ్వరరావు, కాండ్రేగుల నాగేశ్వరరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.